
ఎస్.కె.మిశ్రో - నవ్య వీక్లీ కథల పోటీలో బహుమతి పొందిన కథ

# విషపరిష్వంగం



స్టార్ హోటల్లోని అతిపెద్ద కాన్ఫరెన్స్ హాలు.

మధ్యలో చిన్న స్టేజ్. దాని చుట్టూ వర్తులాకారంలో కుర్చీలు. హాలులో వెలుగు పరుస్తోన్న లైట్లు, 'లైవ్' ప్రసారానికి కెమేరాల ఏర్పాట్లు. హాలు నలువైపులా పెద్ద పెద్ద స్క్రీన్‌లు. వాటిల్లో స్టేజిమీది వారు అతి స్పష్టంగా క్లోజప్‌లో కన్పించే ఏర్పాట్లు. నలువైపులా స్పాన్సర్ల హోర్డింగులు!

హాల్లోని కుర్చీలన్నీ టిక్కెట్లు కొనుక్కొచ్చిన ప్రేక్షకులతో నిండి పోయాయి. బయట 'హౌస్‌ఫుల్' అని బోర్డు పెట్టారు. అయినా టిక్కెట్ల కోసం జనం గోల చేస్తూనే ఉన్నారు.

ఆన్ లైన్‌లో తిలకించడానికి ప్రపంచ వ్యాప్తంగా లక్షలాదిమంది 'ఫీ' చెల్లించారు. మరింత మంది ఎగబడి పే చేస్తున్నారు. వారి సంఖ్య క్షణక్షణానికీ అనూహ్యంగా పెరిగిపోతోంది.

స్టేజి మీద ఒక యువకుడు నిలబడి వున్నాడు. అతడి మెడకి ఉరితాడు లూజుగా తగిలించారు. ఉరి రెండో కొస పైనున్న ఇనుప రాడ్‌కి కట్టి వుంది.

ఇంకొద్ది సేపట్లో ఆ యువకుడు – పేరు ఆనంద్ – ఉరిబోసుకుని ఆత్మహత్య చేసుకోబోతున్నాడు!

ఆ ఘట్టాన్ని కళ్ళారా తిలకించడానికి టిక్కెట్లు కొనుక్కొచ్చారు ప్రేక్షకులు. దూర ప్రాంతాల వాళ్ళు 'ఆన్ లైన్'లో ప్రత్యక్షంగా చూట్టానికి ఉవ్విళ్ళూరుతున్నారు. అంతా ఎక్సైటింగా ఫీలవుతూ అద్భుత దృశ్య వీక్షణకి సన్నద్ధమవుతున్నారు.

"అతగాడ్ని చూడండి ఎలాంటి ఫీలింగ్సూ లేకుండా మామూలుగానే ఉన్నాడు. ఏదో నాటకం వేస్తున్నట్టు లేదూ?" ప్రేక్షకుల్లోని ఒకామె ప్రక్కవారిని అడిగింది.

"అబ్బే. ఇంత సింపుల్‌గా చనిపోతే మజా ఏం వస్తుంది. ఇంకా ఏడ్పులూ పెడబొబ్బలూ ఉంటాయనెంతో ఆశతో వచ్చాను" నడి వయస్సతను నాలిక చప్పరించాడు.

"అవునవును. నిజంగా ఆత్మహత్య చేసుకుంటున్నప్పుడు అతడి భావోద్వేగాలు భయాలు నరకయాతన ఏ స్థాయిలో ఉంటాయో కళ్ళారా చూట్టానికే కదా అంత డబ్బు పోసి టిక్కెట్టు కొనుక్కొచ్చిందీ!" మరొకావిడ వ్యాఖ్యానించింది.

"చూస్తోంటే నిర్వాహకులేదో ట్రిక్ ప్లే చేసి మనల్ని మోసం చేస్తారనిపిస్తోంది" ఇంకెవరో అన్నారు.

"అలా చేస్తే ఊరుకుంటామేమిటి. కోర్టు కీడ్చి నష్టపరిహారం రాబడతాం" కుర్ర లాయర్ ఉద్రేకపడ్డాడు.

"అసలతడెందుకు సూయిసైడ్ చేసుకుంటున్నాడో!" ఒక స్టూడెంట్ అడిగింది.

"ఎందుకన్నది మనకనవసరం. ఎలా చేసుకున్నాడు, చేసుకుంటున్నప్పుడతట్లో ఎన్ని మార్పులు ఎలాంటి మార్పులొచ్చాయన్నదే మనకి ముఖ్యం!"

అవునవునంటూ తలాడించారు మరికొందరు.

ఈవెంట్ మేనేజర్ శాంప్సన్ అండ్ శాంప్సన్ కంపెనీ ప్రతినిధి విలియమ్స్ ఫుల్ సూట్లో స్టేజి మీద కొచ్చాడు. కిక్కిరిసి వున్న జనం వంక సంతృప్తిగా చూశాడు.

"లేడీస్ అండ్ జెంటిల్ మేన్! మేం చేబట్టిన ఈ వినూత్న కార్యక్రమాన్ని జయప్రదం చేసిన మీకూ ఫీ చెల్లించి నెట్లో వీక్షిస్తోన్న ప్రేక్షక మహాశయులకూ మా కృతజ్ఞతలు. ఇంకో ముప్పై నిమిషాల్లో మీరు ఉత్కంఠతో ఎదురు చూస్తోన్న క్షణాలు ఘనీభవించబోతున్నాయని మనవి చేస్తున్నాను. ఇప్పుడు మరణానికి నాలుగడుగుల దూరంలో వున్న మిస్టర్ ఆనంద్‌ని మీరు ప్రశ్నించవచ్చు. ఎలాంటి ప్రశ్నలైనా సంధించవచ్చు. హ్యాప్ప్రీయప్.....!"

కొన్ని క్షణాల పాటు నిశ్శబ్దం అలుముకుంది.

"మీరెందుకు ఆత్మహత్య చేసుకుంటున్నారు? అది పాపం కాదా?" ఒకరడిగారు.

"జాతస్య మరణం ధ్రువం అన్నారు. పుట్టిన ప్రతి జీవీ గిట్టక తప్పదు. కాదంటే నేను కొంచెం ముందుగానే బకెట్ తన్నేస్తున్నాను....."

అతడి మాటలు పూర్తి కాకుండానే ఒకరు లేచి, "అంత బాధేం వచ్చి పడింది?" అని ప్రశ్నించారు.

"నేను నిరుద్యోగిని. ఏదో ఒక ఉద్యోగం కోసం ప్రయత్నించి ప్రయత్నించి విసిగి వేసారి పోయాను. స్వయం ఉపాధికీ ప్రయత్నించాను గాని పెట్టుబడి పుట్టలేదు. నా మీదే ఆధారపడి ఒక అక్క ఒక తమ్ముడు అమ్మా నాన్నా ఉన్నారు. అక్క పెళ్లి చేయాలి. తమ్ముడ్ని చదివించాలి. నాన్నకి హార్ట్ ఆపరేషన్ చేయించి వాల్వ్ వేయించాలి. ఎందర్ని ఎన్ని రకాలుగా దేబిరించినా డబ్బు పుట్టలేదు.....!" అతడి కంఠం రుద్ధమైంది.

"లోకంలో నీ కన్నా హీన స్థితిలో కోట్లాదిమంది వున్నారు. వాళ్ళంతా బతకట్లేదూ? నీకేం మాయరోగం వచ్చింది?" ఒకావిడ 'నెట్లో' నిలదీసింది.

"పాయింటే. కాని సీత కష్టాలు సీతవి పీత కష్టాలు పీతవి. నా సమస్యల పరిష్కారానికి ఇదొక్కటే మార్గం అన్పించింది. శాంప్సన్ వారిని అప్రోచ్ అయ్యాను. వాళ్ళు వెంటనే

ఈవెంట్‌ని మ్యానేజ్ చేస్తామన్నారు. అలా అగ్రిమెంటు అయ్యిందో లేదో ఇలా స్పాన్సర్లు ౖతోసుకొచ్చారు. అయామ్ గోయింగ్ టు మేక్ బిగ్ మనీ!"

"పిచ్చోడా ! నువ్వు చస్తావుగా నీ చేతికెందుకొస్తుంది? నీ వాళ్ళకి వస్తుంది. వీలునామా రాశావా లేదా?" ఒక పెద్దాయన ప్రశ్నించాడు.

"దాని అవసరం లేదు. మొత్తం కలెక్షన్లో ఈవెంట్ మేనేజర్ ఫిఫ్టీ పెర్సంట్ తీసుకుంటారు. మిగతాది ఎవరెవరికి ఎంత సొమ్మివ్వాలో అగ్రిమెంట్లో రాసుకున్నాం"

ఆనంద్ మాటలూ ప్రవర్తనా ముందు వరుసలో కూర్చున్న ఒకరికి బొత్తిగా నచ్చలేదు.

"నువ్వు చావబోతున్నావయ్యా, చావంటే తెలుసుగా. నీ చుట్టూ ఉన్న ప్రపంచం అలాగే వుంటుంది. నీ వాళ్ళూ మేమూ అంతా ఉంటాం. కాని నువ్వు మాత్రం ఉండవ్. ఇప్పుడూ నిమ్మకి నీరెత్తినట్టు ఉండగలవా చెప్పు?"

"ఉంటాను. మీరూ మా బంధుమిత్రులూ అంతా ఏదో ఒక రోజున చనిపోతారని నాకు తెలుసు గనుక. నా ఈ బలిదానం వల్ల నా వాళ్ళకి గొప్ప భవిష్యత్తు లభించబోతోందన్న ఆనందం నన్ను తిన్నగా నిలవ నీయట్లేదు. నా జన్మసార్థక మవబోతోందన్న ఊహ నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది...!" అన్నాడు ఆనంద్.

అతడి మొహంలో ఎలాంటి విచారం బాధ వ్యథ లేకపోయేసరికి చాలామంది నెటిజన్లు హతాశులయ్యారు. ఎవరో చీట్ చేసినట్టు ఫీలయ్యారు.

వెంటనే "వాటీజ్ దిస్ నాన్సెన్స్" అంటూ కాల్స్‌తో మెయిల్స్‌తో శాంప్సన్ అండ్ శాంప్సన్ కంపెనీ మీద దండెత్తారు.

దాంతో విలియమ్స్ గొంతు సవరించుకున్నాడు.

"కూల్డౌన్ కూల్డౌన్. మీరు అపురూపమైన ఘటనని చూడబోతున్నారు. మరణ సమయం సమీపించే కొద్దీ మెల్ల మెల్లగా భయాందోళనలు రక్తంలో శరీరంలోని అణువణువులోనూ ప్రవహిస్తాయి. ఇప్పుడు నిబ్బరంగా వున్న ఈ యువకుడే అప్పుడు పిచ్చెత్తినట్టు బెంబేలు పడతాడు. కేకలు వేస్తాడు. మెల్లగా ఉరి బిగుస్తోంటే ప్రాణభయంతో అరుస్తాడు. అల్లల్లాడి పోతాడు. కళ్ళు పెద్దవై వికృతంగా మారతాయి. బయటికి పొడుచుకు వచ్చినా రావొచ్చు. మొఖాన్ని చావు కళ ఆక్రమించి రకరకాల విన్యాసాలు చేయిస్తుంది. కాళ్ళూ చేతులూ కొట్టుకోవడమే కాదు మలమూత్రాలు విసర్జించనూవచ్చు. ఆ ఆఖరి క్షణాల్లో అతడు పడే మరణ యాతనని మీరు ప్రత్యక్షంగా చూసే అపూర్వ అవకాశాన్ని

కల్పించింది మా శాంప్సన్ అండ్ శాంప్సన్, వరల్డ్స్ ది బెస్ట్ ఈవెంట్ మేనేజింగ్ కంపెనీ.....!"

నిజమే అన్పించింది చాలా మందికి. అంగీకార సూచకంగా తలలాడించారు కొందరు.

"నేనో చిన్న ప్రశ్న అడగొచ్చా?" విలియమ్స్‌ని అడిగాడు ఆనంద్.

"అడుగు. వాళ్ళకి నచ్చితే జవాబిస్తారు. బట్ కట్ షార్ట్. పోచికోలు కబుర్లతో టైం వేస్ట్ చెయ్యకు"

గొంతు సవరించుకుసన్నాడు "మీరెందుకీ షో - సారీ - ఈ ఆత్మహత్య ఘట్టాన్ని ప్రత్యక్షంగా చూడాలని ఎగబడి వచ్చారు?"

"ఇదో థ్రిల్లింగ్ ఈవెంట్!" "నిజ జీవితంలో ఇలాటివి చూళ్ళేం కదా!" "ఎలా ఛస్తారో చూడాలన్నది ఎప్పట్నుంచో నా కోరిక!" "గిలగిల తన్నుకుంటూ చస్తొంటే చూడటం భలే మజాగా వుంటుందిలే!"

"బలవంతాన చచ్చేప్పటి స్క్రీమింగ్ వుందే అది వింటే ఎంత ఎక్సైటింగా వుంటుందో చెప్పలేను!" "రేపెప్పుడైనా నేనూ సూయిసైడ్ చేసుకోవాలంటే అప్పుడెలాటి బాధ పడాలో ఇప్పుడే తెలుసుకుందామని!" "హర్రర్ సినిమాల్లా ఇదీ ఒక రకమైన ఎంటర్‌టైన్‌మెంటే కదా!"

ఎన్నో సమాధానాలు చకచకా వచ్చి పడ్డాయి.

"మీకెవరికీ నా మీద జాలి సానుభూతి అనుకంప ఏమీ లేవా?" గాద్గదిక స్వరంతో అడిగాడు.

"నీ అంతట నువ్వు కావాలని ఛస్తోంటే మాకెందుకుంటాయి?" ఎదురు ప్రశ్నించారొకరు.

"నీ ప్రోబ్లమ్స్ గురించి నువ్వు సూయిసైడ్ చేసుకొంటోంటే మధ్యలో కల్పించుకోడానికి మేమెవరం?" అని ఇంకో ఒకరు, "నీ లైఫ్ నీ ఇష్టం. నీ ఫ్రీడమ్‌ని కర్టెయిల్ చేసే రైట్ ఎవరికీ లేదు" అని మరొకరు, "ఐ లైక్ యువర్ బోల్డ్ డెసిషన్" అని ఇంకొకరు అన్నారు.

ఇంతలో ప్రేక్షకుల్లోని ఒకావిడ తన తొమ్మిదేళ్ళ కుర్రాడ్ని తీసుకుని స్టేజి మీదకి దూసుకెళ్ళింది.

సెక్యూరిటీ వాళ్ళొచ్చి ఆమెని ఆపబోయారు గాని వాళ్ళని త్రోసేసి విలియమ్స్ దగ్గరి కెళ్ళింది.

"పదేళ్ళలోపు పిల్లలకు అనుమతి లేదన్నాం కదా. వీడ్ని ఎలా తీసుకొచ్చారు?" ప్రశ్నించాడతడు.

"పదేళ్ళని చెప్పి టిక్కెట్టు తీసుకున్నాన్లే గాని మీరేం టెన్షన్ పడొద్దు. వీడికి హింసాత్మక దృశ్యాలంటే చాలా ఇష్టం. 'సా' సినిమా ఏడు పార్టులూ 'స్క్రీమ్' సినిమా నాలుగు పార్టులూ ఒక్కోటీ అయిదేసిసార్లు చూశాడు. డబ్లుయు డబ్లుయు ఎఫ్ పోటీల్ని రెప్ప వెయ్యకుండా చూస్తాడు తెలుసా? హర్రర్ సినిమాలంటే పడిచస్తాడనుకోండి. వీడు చిన్నవాడు కావచ్చు గాని భయపడే పిరికి వాడు కాదు... మా వాడి ఆసక్తినీ ఇష్టాన్నీ కాదనే హక్కు మీకూ నాకూ లేదు...!"

"మీ స్వంత పూచీ మీద తీసుకొచ్చారు. అందులో మా బాధ్యతేం లేదని ముందే తెలియజేస్తున్నాం. మీరేమైనా అడగాల్సొస్తే మీ సీట్లో కూర్చుని అడగాలి తప్ప ఇలా స్టేజి మీదకి రాకూడదు. ఇదంతా లైవ్‌గా ప్రసారమవుతోంది..." కంగారుపడుతూ అన్నాడు.

"ఆవిడ్ని అడగనివ్వండి" పది గొంతులు అరిచాయి.

"ఏం చెబుతుందో చూద్దాం" అన్నారు నెట్‌లో చూస్తున్న వాళ్ళు.

"అయితే నెటిజన్లేమంటారో పోల్ కండక్ట్ చేస్తాం.."

మరుక్షణం "ఆవిడ్ని మాట్లాడనిమ్మంటే 'వై' అనీ వద్దంటే 'ఎన్' అనీ మెయిల్ గానీ ఎస్సెమ్మెస్ గానీ చెయ్యండి" అన్న మెస్సేజ్ వెబ్‌సైట్లో ప్రత్యక్షమైంది. అది స్క్రీన్ మీద ప్రతిబింబించింది.

చకచకా పోల్ చేశారంతా. జవాబుని హాల్లో అమర్చిన స్క్రీన్ మీద గ్రాఫ్ రూపంలో చూపించారు. 91శాతం 'వై' అన్నట్టు పేర్కొన్నారు.

"మీరేం అడుగుతారో అతడేం చెబుతాడో అని ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురు చూస్తోంది. నౌ యూ కెన్ గో ఎహెడ్..." అన్నాడామెతో వినయంగా విలియమ్స్.

"ఈ ఘోర కలిని ఆపండి!" ప్రేక్షకుల వైపు తిరిగి హిస్టీరియా పేషంట్లా బిగ్గరగా అరిచిందామె.

ఉలిక్కి పడ్డారు. కార్యక్రమాన్ని ఆపేస్తారేమోనని భయపడ్డారు.

"నో నో" అని అరిచారు హాల్లోని జనం. స్క్రీన్ మీద 'నో' అంటున్న వాళ్ళ సంఖ్య చకచకా పెరిగిపోతోంది.

"తక్షణం ఆపకపోతే పోలీస్‌కి కంప్లయింట్ చేస్తాను. ఎన్నో అద్భుతాలు చేయగల మహత్తర శక్తులున్న ఈ ఉడుకునెత్తురు యువకుడ్నిలా అర్ధాంతరంగా చావనివ్వను..." ఏడుస్తూనే అరుస్తూ చెప్పింది.

"మీరు ఈ చావు చూడాలనే కదా టిక్కెట్ కొనుక్కుని మరీ వచ్చారు?" ఒకరు ప్రశ్నించారు.

"యస్. కాని అతడ్ని చూస్తోంటే... జరగబోయేది తల్చుకుంటే... నోనో. ఆ కాంట్ బేరిట్. అసలు మీరు ఈ ప్రోగ్రాం కండక్ట్ చెయ్యడానికి ప్రభుత్వ పర్మిషన్ తీసుకున్నారా?"

"ఈ గ్లోబల్ విలేజ్‌లో చట్టాలు మారాయి. ప్రభుత్వాల పరిధులూ మారాయి. అదీ గాక ఇది వ్యక్తి స్వేచ్ఛలో ఓ భాగం. ఎవరూ కల్పించుకుంటారనుకోను. బ్రతికే హక్కులానే ప్రతి వారికీ చనిపోయే హక్కు ఉంది..."

"నేనొప్పుకోను..." సెల్‌ఫోన్ తీసుకుని గబగబా నెంబర్లు డయల్ చేసింది. "పోలీస్...?"

"యస్" అంటూ ప్రేక్షకుల్లోంచి లేచాడో పోలీస్ అధికారి.

"మీరిక్కడ..?!"

"నాలోనూ కొంచెం యానిమల్ ఇన్‌స్టింక్ట్ వుంది. యూ నో - ఆయామ్ ఆల్సో మ్యాన్ లైక్ యూ ఆల్...." అన్నాడతడు రెక్లెస్‌గా.

"మీరీ ఘోరాన్ని ఆపండి. ఇప్పుడే కంప్లయింట్ రాసిస్తా"

"సారీ మేడమ్. ఈ ఏరియా నా పరిధిలోకి రాదు. ఐ కాంట్ హెల్ప్ యూ" అని కూర్చున్నాడతడు.

"మరేం చెయ్యమంటారు?" నిస్పృహగా అడిగిందామె.

"పోలీస్ కంట్రోల్ రూంకి ఫోన్ చెయ్యండి" సలహా ఇచ్చాడతడు.

"మీరనవసరంగా ప్రేక్షకుల విలువైన సమయాన్ని వృథా చేస్తున్నారు" అంటూ విలియమ్స్ అడ్డు వెళ్ళి సెల్ లాక్కో బోయాడు గాని ఆసరికే ఆమె కాల్ చేసేసింది. నుదురు కొట్టుకుంటూ నిస్సహాయంగా నిలబడి పోయాడతడు.

"వాట్ కెన్ ఐ డూ ఫర్యూ..." అవతల్నుంచడిగారు.

"ఇక్కడో ఘోరం జరుగుతోంది. పబ్లిగ్గా అందరూ చూస్తూండగా ఒక యువకుడు సూయిసైడ్ చేసుకుంటున్నాడు. మీరు వెంటనే వచ్చి ఆపండి సార్... అతడి ప్రాణాలు కాపాడండి సార్... ప్లీజ్...!"

"ఎక్కడ జరుగుతోంది ఎవరు నిర్వహిస్తున్నారు ఎవరెవరి అనుమతులు తీసుకున్నారు? ఆ యువకుడి వివరాలూ నేషనాలిటీ అన్నీ వివరంగా చెప్పండి...!"

"అవేమీ నాకు తెలీదు. నా కళ్ళ ముందు దారుణం జరుగుతోంటే సహించలేక చేశాను..."

"సారీ మేడం. రూల్స్ ప్రకారం వివరాలన్నీ కావాలి. ఆ తర్వాతే మేం ఏమైనా నిర్ణయం తీసుకోగలం. బై మేడం.... ఉయార్ ఆల్వేస్ రెడీ టు హెల్ప్ యూ మేడం. థాంక్యూ ఫర్ కాలింగ్!"

లైన్ కట్టయ్యింది. పెదవి కొరుక్కుంది. కన్నీళ్ళు బిగబట్టింది. "మీరైనా ఈ దారుణాన్ని ఆపండి" అంటూ జనాన్ని అర్థించింది.

"టైమవుతోంది. ఆమెని ప్రక్కకి ఈడ్చేయండి" ఒక బొంగురు గొంతు అరిచింది.

"నేను ఇక్కడ్నుంచే చూస్తాను మమ్మీ" తల్లి చెయ్యి వదిలించుకుని ఆమె కొడుకు మారాం చేశాడు.

సెక్యూరిటీ వాళ్ళొచ్చి ఆమెనీ ఆ కుర్రాడ్నీ లాక్కెళ్ళిపోయారు.

"హమ్మయ్య. వాన వెలిసింది. ముహూర్తానికింక పదిహేను నిమిషాలే వుంది. మన మిస్టర్ ఆనంద్ ఎలా ఉన్నారో ఏమంటారో చూద్దాం. హలో మిస్టర్! ఇప్పుడెలా ఫీలవుతున్నారు...?"

"అయామ్ ఓకే. మీరు ఓకేనా? ఓకేయే లెండి. ఇప్పుడు మీకో షాక్ ఇస్తాను. బీ రెడీ" అంటూ చిన్నగా నవ్వుతూ మెడలోని ఉరితాడు తియ్యబోయాడు. రాలేదు కంగారు పడ్డాడు. గింజుకున్నాడు. ఎలాగోలా దాన్ని బయటికి లాగాలని విశ్వప్రయత్నం చేశాడు. సాధ్యం కాలేదు. బెదిరాడు. కన్నీళ్ళు ఉబికి వస్తోంటే భయంగా బేలగా కలవరంగా చూశాడు.

"ఇది రావట్లేదేంటి?" నోరు తడారిపోతుంటే కీచు గొంతుతో అరిచాడు. అతడి ఒళ్ళు ముచ్చెమటల్తో తడిసి ముద్దవుతోంది.

విలియమ్స్ నవ్వాడు. "అది రాదు. ఆఖరి నిమిషంలో మీరు మనస్సు మార్చుకోవచ్చని అలా ఏర్పాటు చేశాం"

వెర్రిగా చూసి గగ్గోలు పెట్టాడు ఆనంద్ "నేను ఆత్మహత్య చేసుకోను. నేను బ్రతుకుతాను. నేను చచ్చినా చావను!"

"సారీ మిస్టర్. ఐ కెన్ డూ నథింగ్...."

"ప్లీజ్...ఈ ఉరి తీసేయండి... తీసేయండి..." మెడలోంచి ఉరితాడుని ఎలాగైనా లాగిపారెయ్యాలని మళ్ళీ మళ్ళీ ప్రయత్నించాడు. సాధ్యం కాకపోయే సరికి ఏడుస్తూ అర్థించాడు.

"నా చేతుల్లో ఏమీ లేదు. అగ్రిమెంటు మార్చడం ఎవరి తరమూ కాదు" కూల్‌గా ఫ్యాక్ట్ వివరించాడు విలియమ్స్.

"నేనింకా బ్రతికే వున్నాను, నేను అగ్రిమెంటుని మార్చేస్తాను. ఇదిగో ఇప్పుడే రద్దు చేసుకుంటున్నాను..."

"సారీ మ్యాన్. ఈవెంట్ రద్దయితే మా రెప్యుటేషన్ డేమేజవుతుంది. మా కంపెనీ షేర్ వాల్యూ దారుణంగా పడిపోతుంది. అలా జరగనివ్వం... మీరు అగ్రిమెంటు ప్రకారం ఆత్మహత్య చేసుకోక తప్పదు..."

"ప్లీజ్.. అయ్యా అమ్మా... నన్ను కరుణించండి. మీ కాళ్ళకి మొక్కుతాను. నన్ను బతికించండి..." భోరున ఏడుస్తూ దణ్ణాలు పెడుతూ ప్రేక్షకుల్ని బ్రతిమాలాడు.

హాల్లో కలకలం లేచింది. వదలమనీ వద్దనీ తర్జన భర్జనలు పడుతున్నారంతా.

"మమ్మల్ని ఫూల్స్‌ని చేద్దామనుకున్నావా?" పోలీసు అధికారి గద్దిస్తూ ఆనంద్‌ని ప్రశ్నించాడు.

"లేదు సార్. నా మీద నేనే ప్రాక్టికల్ జోక్ వేసుకున్నాను. బ్రతుకుతానయ్యా అంటే ఒక్కరూ సాయపళ్ళేదు. మా కుటుంబం సమస్యలతో ఉక్కిరి బిక్కిరి అవుతోందని కన్నీటితో అర్థించినా ఒక్క చేయీ మా కన్నీళ్ళు తుడవడానికి ముందుకు రాలేదు. ఛస్తానంటే లక్షల రూపాయలూ డాలర్లూ వర్షంలా కురిశాయి. మీరూ వద్దు మీ డబ్బూ వద్దు. మీ మీ సొమ్ము వాపస్ చేస్తాను. ప్లీజ్ నన్ను రక్షించండి. ఈ ఉరి నుంచి నన్ను తప్పించండి. నాకు ప్రాణభిక్ష పెట్టి పుణ్యం కట్టుకోండి..." స్టేజి మీద కలతిరుగుతూ కన్నీళ్ళు కారుస్తూ హోరున ఏడ్వసాగాడు ఆనంద్.

"చూడండి చూడండి. అతడి కళ్ళల్లో మొఖంలో తాండవమాడుతోందే అదే మృత్యు భయం.....!" అంటున్న వాడల్లా చెవుల్లోని మైక్ ద్వారా ఏదో విని "నువ్వు సరిగ్గా కన్పించట్లేదుట. నువ్వటూ ఇటూ తిరిగితేకాదు. నువ్విక్కడే ఈ సెంట్రల్ ప్లేస్‌లోనే వుండాలి. అప్పుడే కెమేరాలు నీ ఎక్స్‌ప్రెషన్స్ కరెక్టుగా క్యాచ్ చెయ్యగల్గుతాయి" అంటూ అతడ్ని స్టేజ్ మధ్యలోకి తీసుకెళ్ళి నిలబెట్టాడు విలియమ్స్.

"ఉరితాడుని టైట్ చెయ్యండి" తన వాళ్ళకి సూచనలిచ్చాడు. వెంటనే తాడు రాడ్‌కి మరింత చుట్టుకుంది.

నిర్దేశిత స్థానం నుంచి ప్రక్కకి కదిలే అవకాశం పోయింది. మెడకి తగిలించి వున్న ఉరిని గుంజుతూ "ప్లీజ్... దీన్ని తీసెయ్యండి నేను చావను! బతుకుతాను...!" అంటూ విలియమ్స్ చేతులు పట్టుకుని అర్థించాడు ఆనంద్.

"అగ్రిమెంటు మీద సంతకం పెట్టిన మరుక్షణం నీ మీద నువ్వు హక్కు కోల్పోయావు. ఇప్పుడు వెనకడుగేస్తే నీక్కాదు మాకు చావొచ్చి పడుతుంది. వీళ్ళకీ స్పాన్సర్లకీ బొచ్చెడు నష్ట పరిహారం చెల్లించాలి..." అన్నాడతను.

"అందర్నీ అర్థిస్తాను. అందరి పాదాలూ నా కన్నీళ్ళతో కడుగుతాను. ప్లీజ్ నన్ను రక్షించండి... నేను పోతే అమ్మా నాన్నా అక్కా తమ్ముడూ అంతా మూకుమ్మడిగా ఆత్మహత్య చేసుకుంటారు ప్లీజ్... నన్నూ నా కుటుంబాన్నీ రక్షించండి. నా చర్మం చీల్చి చెప్పులు కుట్టిచ్చి మీ ఋణం తీర్చుకుంటాను. కరుణించండి ప్లీజ్...!"

అతడు ప్రాధేయ పడుతోంటే నవ్వేడు విలియమ్స్. "నీకు నువ్వు నీ శరీరంలోని అన్ని అంగాలనీ కోసి వేలం వేసినా ఒన్ పెర్సంట్ నష్టపరిహారానికి సరిపోదు గాని అనవసర రాద్ధాంతం వద్దు. గుడ్‌బాయ్‌లా అగ్రిమెంటుకి కట్టుబడి వ్యవహరించు. నీకు ఇంక అయిదు నిమిషాలే వ్యవధి వుంది. బీ రెడీ టూ డై...!"

"వదలండి వదలండి నేను బతుకుతాను...!" కంఠనాళాలు తెగిపడేలా అరిచాడు.

"ఊరికే అరిచి గోల చేసే బదులు దైవ ప్రార్థన చేసుకో" సలహా ఇచ్చాడో వృద్ధుడు.

అతడి కన్నీళ్ళకి కరిగిపోయిందో పెద్దావిడ. "పోనీ మెజార్టీ ఏమంటున్నారో పోల్‌కి పెట్టండి" అంది కళ్ళు తుడుచుకుంటూ.

"సారీ మేడమ్. మా మీద ఎంతో నమ్మకంతో టిక్కెట్లు కొనుక్కుని ఇక్కడికి వచ్చిన వారినీ రుసుం చెల్లించి నెట్లో చూస్తున్న వారినీ నిరాశ పర్చలేం. ఘోర మరణ యాతనని ప్రత్యక్షంగా చూసి ఆనందించాలనెంతో ఆశతో వచ్చిన కస్టమర్లని నిరుత్సాహ పరచలేం.

మీ అందరికీ ఉద్విగ్న దృశ్యాలని చూపించి అద్భుతానందాన్ని కలిగిస్తామని మరోసారి గ్యారంటీ ఇస్తున్నాం. ఆఖరి గడియలు లెక్క పెడుతున్న ఇతడి మానసికి వేదననీ శారీరక హింసనీ మిస్ కాకుండా చూడండి. ఆర్తనాదాలు వినండి...! ప్రాణాలు నవరంధ్రాల్లోని ఏ రంధ్రం ద్వారా పోతుందో రెప్ప వెయ్యకుండా చూడండి. ఇలాంటి అరుదైన అవకాశం చేజిక్కించుకున్న అదృష్టవంతులు మీరు. ఇందుక్కారణం శాంప్సన్ అండ్ శాంప్సన్ కంపెనీ అని సగర్వంగా మనవి చేస్తున్నాను....."

ఆనంద్ పిచ్చిగా అరుస్తున్నాడు. బొబ్బలు పెడుతున్నాడు. సెక్యూరిటీ వాళ్ళొచ్చి కాళ్ళు కట్టేశారు. చేతులు వెనక్కి విరిచి బంధించారు.

కళ్ళ నుండి రక్తాశ్రువులు రాల్తున్నాయి. గొంతు చించుకుంటూ కాపాడమని అరుస్తూనే వున్నాడు. దేబిరిస్తూనే వున్నాడు.

ఉరితాడు తగిలించిన ఇనుప రాడ్ గుండ్రంగా తిరగసాగింది. మెల్లమెల్లగా ఉరి బిగుస్తోంది. ఆనంద్ గిల గిలా తన్నుకుంటున్నాడు. ఘోరున దుఃఖిస్తూ కేకలు పెడుతున్నాడు.

కెమేరాలు క్లోజప్‌లో అతడి ఆవేదనని విభిన్న కోణాల్లో చిత్రించి నెట్లో, హాల్లోని స్క్రీన్‌ల మీద చూపిస్తున్నాయి.

ఊపిరి బిగబట్టి కొందరు, ఊపిరి పీల్చుకోవడం మరచిపోయి మరి కొందరు, ఊపిరి ఏ రంధ్రంలోంచి పోతుందోనని ఇంకొందరు ఉగ్గబట్టి చూస్తున్నారు.

జనం రకరకాల ఉద్వేగాలకు లోనవుతున్నారు. కొందరు ఆపండంటూ అరుస్తున్నారు. కొందరు ఇంతింత కళ్ళతో చూస్తూ చెవులు నిక్క బొడుచుకుని ఆర్తనాదాలు వింటున్నారు. మరి కొందరు ప్రూన్పడి చూస్తున్నారు. 'ఇది నిజమేనా లేక...!' అని కొందరు అపనమ్మకంగా తిలకిస్తున్నారు.•ఇంకొందరు కోపోద్రిక్తులై కుర్చీల్ని ధ్వంసం చెయ్యసాగారు.

ఆ దృశ్య బీభత్సాన్ని నెట్‌లో చూస్తున్న వాళ్ళు రకరకాల మెయిల్స్ పంపుతున్నారు. నిర్విరామంగా కాల్స్ చేస్తున్నారు.

ఇంతలో ఒక దీర్ఘ ఆర్తనాదం ప్రేక్షకుల చెవుల్లోంచి దూరి లోపలి కెళ్ళి మెదళ్ళని మొద్దు బరిచింది!

కళ్ళు పొడుచుకొచ్చి నాలుక వెళ్ళుకొచ్చి ప్యాంటు మాలమూత్రాలతో తడిసి ముక్కు చెవుల్లోంచి రక్తం కారుతూ.... ఆనంద్ శవం ఉరికి వ్రేలాడుతోంది!

నిశ్చేష్టులయ్యారంతా. గుండెలు బరువెక్కాయ్. మొఖాలు జేవురించాయ్.

"ఘోరం!' 'దారుణం!' 'అది హత్య!' అరుస్తున్నారు టిక్కెట్లు కొనుక్కొచ్చిన జనంలోని కొందరు దుఃఖోద్విగ్నులై ఊగి పోతూ.

* * *

అవునూ - అది హత్యా? ఆత్మహత్యా?

ఏదైతే దానికి - బాధ్యులెవరు?

దారి తప్పిన యువతా? పట్టించుకోని ప్రభుత్వాలా? ప్రేక్షకుల విపరీత ధోరణులా వికృత కోర్కెలా? వాటిని సొమ్ము చేసుకుంటున్న సంస్థలా? విష సంస్కృతుల్ని పంచుతున్న ఎలక్ట్రానిక్ మీడియానా? లేక అన్నిటికీ హద్దులు చెరిపేసిన విశృంఖల అంతర్జాలమా?

ఇలా జరిగిన జరుగుతున్న ఘటనలకి మీరూ సాక్షులే గనుక మీ బాధ్యత నుంచి తప్పించుకోలేరు. సమాధానం చెప్పండి?!

**(నవ్య వారపత్రిక 16.1.2013)**